క్లుప్తంగా

రాజకీయ దిగ్గజం రోశయ్య



సత్తెనపల్లి: రాజకీయ దిగ్గజం, మాజీ ముఖ్య మంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య ఆదర్శప్రాయుడని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. గురువారం కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రోశయ్య సేవ లను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మద్ది వెంకటేశ్వరరావు, కొత్త రామకృష్ణ, చౌట శ్రీనివాసరావు, జవ్వాజి రామ్మోహన్‌రావు, దివ్వెల శ్రీనివాస రావు, నోముల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భారత్ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానంద



సత్తెనపల్లి: చికాగోలో తన అద్భుతమైన ప్రసంగాన్ని అందించి భారత్ పేరు ప్రఖ్యాతలను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని నవ చైతన్య వివేక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నోముల వెంకట చలప తిరావు అన్నారు. స్వామి వివేకానంద వర్ధంతిని పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివేకానంద విగ్రహనికి పుష్పాంజలి ఘటించారు. యువతకు స్వామి వివేకానంద జీవితం స్ఫూర్తి దాయకం అని కొనియాడారు. నిరుపేదలకు భరతమాత అన్నప్రసాద వితరణ పథకంలో చలపతిరావు ఆర్థిక సాయంతో 624వ రోజు బోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుదీర్ఘ కాలంగా భరతమాత అన్నప్రసాద వితరణ పథకం నిర్వహిస్తున్న దివ్వెల శ్రీనివాసరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందా స్వామి, చిలకల శ్రీనివాసరావు, బాలనాగు శివ కోటేశ్వరరావు ఉన్నారు.

చిరస్మరణీయుడు వీఎం రంగా




అచ్చంపేట: అన్నివర్గాల ఆరాధ్య దైవం వంగవీటి మోహనరంగా చిరస్మరణీయుడని చిగురుపాడు సర్పంచ్ గంధం కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఆంజనేయస్వామి విగ్రహ సెంటర్‌లో గురువారం ఉదయం వంగవీటి మోహనరంగా 77వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడారు. రంగా ఒక వర్గానికో, ఒక కులానికో చెందినవాడు కాదని, ఆపదలో ఉన్న అందరికి అండగా ఉండి, బడుగు బలహీనవర్గాల వారికి చేదోడుగా నిలచిన గొప్పవ్యక్తి అని అన్నారు. ముందుగా జన్మదిన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, డాక్టర్ శింగారపు వెంకటేశ్వరరావు, తిమ్మిశెట్టి కోటి, కిలారి 2ంజనేయులు, పోలిశెట్టి చెంచయ్య, నీలం ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్‌ల వితరణ



అచ్చంపేట: స్థానిక సాంఘిక సంక్షేమ బీసీ బాలికల వసతి గృహానికి స్నేహ హస్తాలు ఫౌండేషన్ అందజేసిన నాలుగు సీలింగ్ ఫ్యాన్‌లను చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు తుమ్మా శౌర్రెడ్డి బీసీ బాలికల వసతి గృహం వార్డెన్ శైలజకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శౌర్రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ప్రారంభమైనందున దోమల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. రాత్రిళ్లు దోమల బెడద నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు ఒక్కోటి రూ.3వేలు ఖరీదు సీలింగ్ ఫ్యాన్‌లను ఇచ్చనట్లు తెలిపారు. స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు ఉన్నారు.

ఘనంగా మాస శివరాత్రి వేడుకలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మరకత లింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మాస శివ రాత్రి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. విశేష ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మాస శివరాత్రి ప్రత్యేకమైన రోజు కావడంతో పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

అల్లూరి త్యాగం చిరస్మరణీయం

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాలు

సత్తెనపల్లి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం తరతరాలు గుర్తుంటుందని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్‌రోడ్డులో ఉన్న తారక రామాసాగర్ గేటు ఎదురుగా స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. చైతన్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, సభ్యుడు జేపీఎస్ శాస్త్రి మాట్లాడారు. అనంతరం కన్నా నాగరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద చైతన్య భారతి గౌరవ అధ్యక్షుడు కొల్లిపర కాశీవిశ్వనాథం, ఉపాధ్యక్షుడు పుట్టి సాంబశివరావు, సెక్రటరీ కాకాని శ్రీనివాసరావు, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బారెడ్డి, శ్రీ వెంకటరత్నం, ఏడుకొండలు, సత్యనారాయణ, రవికుమార్, కృష్ణ, శివప్రసాద్, నారాయణ సేన నగర సంకీర్తన బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం స్ఫూర్తిదాయకమని సత్తెనపల్లి ఎంపీడీఓ జగదీష్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏవో బసవకుమారి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

బ్రిటిష్ దొరలకు వ్యతిరేకంగా పోరాడి దేశం కోసం ప్రాణాలర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని సీఐటీయూ నాయకుడు పెండ్యాల మహేష్ అన్నారు. పట్టణంలోని పుతుంభాక భవన్‌లో జరిగిన అల్లూరి 127వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డీవైఎఫ్ఐ నాయకుడు జె.రాజ్‌కుమార్ అధ్యక్షత వహించారు. డీవైఎఫ్ఐ మాజీ నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడారు. అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయ కులు అమూల్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద వర్ధంతి గురువారం కార్యక్రమాలు నిర్వహించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. మన్యం ప్రజల హక్కులు, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే దేశం కోసం అమరుడయ్యాడన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రమేష్ మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి ప్రదాత భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరి

క్రోసూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. తహసీల్దారు ఎం.సువర్ణ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయనను స్మరించుకోవటం మనందరి కర్తవ్యమన్నారు.ఈ కార్యక్రమంలో డీటీ కె.శ్రీనివాసరావు, వీఆర్వో బ్రహ్మనాయుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

పెదకూరపాడు: మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత దేశాభివృద్ధికి తోడ్పడాలని తహసీల్దారు జి.వి.గుంట, ఎంపీడీఓ మల్లేశ్వరి కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సీతారామరాజు జయంతి గురువారం నిర్వహించారు. ఆయ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే పెదకూరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



సత్తెనపల్లి పట్టణంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ



టీచర్ మస్తాన్ ఐటీఐలో అల్లూరి చిత్రపటానికి నివాళి



ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎంపీడీవో జగదీష్, సిబ్బంది నివాళి



కన్నా నాగరాజుకు మెమెంటో అందిస్తున్న అన్నం కృష్ణ



అల్లూరి చిత్రపటానికి పెదకూరపాడు అధికారుల నివాళి



పుతుంబాక భవన్‌లో అల్లూరి చిత్రపటానికి నివాళి

మాల మహానాడు ఇన్‌చార్జిగా మాతంగి



పెదకూరపాడు: మాలమహానాడు పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాతంగి సుధాకర్‌రావును నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్ ప్రకటించారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో గురువారం జిల్లా ఉపాధ్యక్షుడు కె.విజయ్ ఆధ్వర్యంలో జాయతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌పాల్ నియామక పత్రాన్ని సుధాకర్‌కు అందించారు. సత్తెనపల్లి మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మరియదాసు, జొన్నలగడ్డ వెంకట్రావు, గణేష్ పాల్గొన్నారు.

రేపు పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

అచ్చంపేట: ప్రపంచ జూనోటిక్ దినోత్సవంలో భాగంగా శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పశువైద్యశాలలు, రైతు భరోసా కేంద్రాల్లో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ పి.స్వాతీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నీటి పరీక్షలపై కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ



పెదకూరపాడు: మండలంలో నీటి పరీక్షలపై కార్యదర్శులకు, సర్పంచ్‌లకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ మల్లేశ్వరి అధ్యక్షత వహించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతిరోజూ చెరువుల నుంచి ప్రజలకు అందించే రక్షిత మంచి నీటిని ఎలా పరీక్ష చేయాలో శిక్షణలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ న్యాయం చేయాలి



ఫిరంగిపురం: గరుడాచలపాలెంలో గత ఎన్నికల ఫలితాల అనంతరం దళితులపై జరిగిన దాడి పరిణాలపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనిపై బుధవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి బాధితుడు, దళిత నాయకుడు జి.రాజసుందరబాబు ఆధ్వర్యంలో తమపై జరిగిన దాడిని గురించి వివరించారు. దీనిపై గురువారం ఆర్డీవో ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ చేసేందుకు తహసీల్దారు రాఘవేంద్రరావు వెళ్లారు. దీంతో మహిళలు తమకు న్యాయం చేయాలని, కలెక్టర్, ఎస్పీ రావాలని, వారికే తమ సమస్యలు వివరిస్తామని చెప్పారు. అనంతరం న్యాయం కావాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేద్దాం

పెదకూరపాడు మండల సర్వసభ్య సమావేశం

పెదకూరపాడు : పార్టీలకతీతంగా పెదకూరపాడును అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మీరయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించాలన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డయేరియా, సీజనల్ వ్యాధులు సోకకుండా వాటర్ ట్యాంకులు శుభ్ర పరచాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరుచుకోవాలన్నారు. జిల్లాలో పెదకూరపాడు మండలం ఉపాధి హామీ పథకం పనితీరులో ప్రథమ స్థానంలో ఉండటంపై సిబ్బందిని అభినందించారు. గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ప్రతి రోజూ 3 గంటల పాటు గ్రామాల్లో పర్యటించి ప్రజలు సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. ఇరిగేషన్, వ్యవసాయ, ఆర్అండ్‌బీ, అటవీ శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్ ఏఈలు గైర్హాజరవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలు పలు గ్రామాల్లో నివాసిత ప్రాంతాల్లో కిందకు వాలి ఉంటున్నాయని, వాటిని సరి చేయాలని కొందరు కోరారు. ఈ సందర్భంగా పాటిబండ్ల ఎంపీటీసీ పాటిబండ్ల మేరి రాణి మాట్లాడుతూ.. పది రోజులుగా పాటిబండ్ల గ్రామంలో తాగునీరు రావడం లేదని, వాడుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి మీరయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశ్వరి, తహసీల్దారు జి.వి.గుంట పాల్గొన్నారు.



సమావేశంలో సమీక్షిస్తున్న ఎంపీపీ మీరయ్య

విద్యా సంస్థల బంద్ విజయవంతం

సత్తెనపల్లి: విద్యార్థి సంఘాలు చేపట్టిన దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్ సత్తెనపల్లి పట్టణంలో విజయవంతమైంది. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. కొన్ని పాఠశాలలకు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు వెళ్లి బంద్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షురాలు అమూల్య మాట్లాడుతూ అసమర్థం ఎన్‌టీఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బంద్‌ను జయప్రదం చేయడానికి సహకరించిన వివిధ పాఠశాలలు, విద్యా సంస్థల యాజమాన్యాలకు విద్యార్థిని, విద్యార్థులకు ఆమె అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జడ రాజ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు చిలక సత్తిబాబు, నాయకులు సాహిద్, ఇశ్యాంత్, నందు, అంకమ్మరావు, అజయ్, సలీం, షరీఫ్, ఆకాష్ నాయకత్వం వహించారు.



పాఠశాలలు మూసివేయడంతో ఇంటిబాట పట్టిన విద్యార్థులు

యువకుడికి తీవ్ర గాయాలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ద్విచక్ర వాహనంపై నుంచి ప్రమాదవశాత్తూ రోడ్డుపై ఉన్న గుంతలో పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని గోళ్ళపాడు గ్రామ సమీపంలో గురువారం జరిగింది. సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామానికి చెందిన తొగటి నాగరాజు నరసరావుపేట వెళ్తూ.. గోళ్ళపాడు గ్రామ సమీపంలో ప్రధాన రహదారికి మధ్యలో ఉన్న గుంతను గమనించక ఎగిరి పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

ప్రకృతి వ్యవసాయంపై మనసు పెట్టాలి

సత్తెనపల్లి: చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడానికి మనసు పెట్టాలని ఎంసీఆర్‌పీ శైలజ పేర్కొన్నారు. మండలంలోని గోరంట్ల గ్రామంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్, సేవే ప్రాణం సేవే జీవితం సంస్థ ఆధ్వర్యంలో చిన్న, సన్న కారు రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలు గురువారం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. డీబీఆర్సీ రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. శైలజ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకొని భూసారాన్ని బట్టి పంటలు మార్పిడి చేయాలని సూచించారు. ప్రత్తి పంటలో కందులు, బెండ విత్తనాలు నాటితే పురుగు, తెగులు ఆశించకుండా ఉంటుందన్నారు. మిర్చి పంట వేసే రైతులు పంటకు రక్షణగా చేను చుట్టూ ఆముదం, కందులు వేసుకోవాలని, పంటలు ఎప్పుడు తూర్పు పడమర మాత్రమే సాలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సూర్యోదయం, అస్తమయాల్లో సూర్యరశ్మి మొక్క వేళ్లకు తగిలితే పురుగు ఆశించదన్నారు. ప్రకృతి సిద్ధంగా పంటలు పండించినట్లయితే ఆరోగ్యంవంతంగా ఉంటాయని, ఆ దిశగా రైతులందరూ వ్యవసాయం కొనసాగించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేవే ప్రాణం సేవ జీవితం సంస్థ ప్రతినిధి నందిగామ నాగేశ్వరరావు, మహిళా రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్‌పీ శైలజ

పశుగ్రాసం విత్తనాల పంపిణీ

శావల్యాపురం: పాడిరైతులు ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న పశుగ్రాసం విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కారుమంచి సెక్టారు పశువైద్యాధికారి సోముల గుణధీర్ అన్నారు. గురువారం మండలంలోని కారుమంచి గ్రామం పశువైద్యశాలలో పాడిరైతులకు జొన్నరకం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి రైతులకు టన్ను విత్తనాలు వచ్చాయని, ఐదు కేజీల సంచి రూ.115 కు అందజేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో రైతుకు 20 కేజీల వరకు ఇస్తామన్నారు. పాడి గేదెల సంఖ్య ఆధారంగా అవసరమైన రైతులకు అదనంగా పశుగ్రాసం విత్తనాలు అందజేస్తామన్నారు.

రొంపిచర్ల : మండలంలోని కర్లకుంట పశు వైద్యశాలలో గురువారం రైతులకు సబ్సిడీపై గడ్డి జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ సాయి మహేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై గడ్డి జొన్నలు పంపిణీ చేస్తోందన్నారు. ఎకరానికి 20 కేజీల చొప్పున పంపిణీ చేస్తామన్నారు. అనంతరం రైతులకు, పశుపోషకులకు గడ్డి జొన్నలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు నాగుల్ మీరా, రాజు, హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రతతో డయేరియా దూరం

అచ్చంపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా అతిసార వ్యాధిని అరికట్టవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.ఇన్నారావు తెలిపారు. డయేరియా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని తాళ్లచెరువులో గురువారం అచ్చంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన శిబిరం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు వచ్చే నీళ్ల విరేచనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలకు ఆగకుండా నీళ్ల విరేచనాలు అవుతున్నట్లయితే వెంటనే జింక్ మాత్రలు మింగించాలని, ఓఆర్ఎస్ తాగించాలని చెప్పారు. జింగ్ టాబ్లెట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అన్ని పీహెచ్‌సీ సబ్ సెంటర్స్, అంగన్‌వాడి కేంద్రాలు, ఆశావర్కర్స్ వద్ద అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాంబాబునాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి, సూపర్‌వైజర్ బేబీరాణి, రామకోటమ్మ, రాధాకృష్ణ, దీప్తి, ఏఎన్ఎం సుశీల, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

చిన్నారుల్లో డయేరియా ప్రాణాంతకం

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): చిన్నారుల్లో డయేరియా అతిప్రమాదకమని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ ఎం.జోస్పిన్ రాణి హెచ్చరించారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో స్టాప్ డయేరియా కార్యక్రమం గురువారం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మూడు సార్లుకు మించి విరోచనాలు అయితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మనుతేజ, ఏఎన్ఎం సౌజన్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



డయేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది.



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రాజుపాలెం: వర్షాలు పడుతున్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. అనుపాలెంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈ నెల 31 మండలంలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతీ ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. రెండు మూడు రోజులు వరుసగా జ్వరం వస్తే రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ దేవానాయక్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏఎన్ఎంలు కమల, ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్‌లు రాజు, మరియదాసు, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, మాధవి, సాంబ్రాజ్యం పాల్గొన్నారు.